క్లుప్తంగా

సాయినాథుడికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో సాయినాథుడికి గురువారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలంలోని మీనవోలు, బనిగండ్లపాడు, పెద్దగోపవరం, పెగళ్లపాడు, ఎర్రుపాలెం తదితర గ్రామాల భక్తులు సాయిబాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయి నిలయంలో దాతలు శీలం శ్రీనివాసరెడి కొండెపాటి వెంకటేశ్వరరావు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం సాయిబాబా దేవాలయం వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా గురువారం అఖండ సాయినామం, పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సాయినాదుడికి ప్రత్యేక పూజలు అనంతరం బాబాని పల్లకీలో ఉంచి మేళాతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

చలివేంద్రం ఏర్పాటు

కల్లూరు: కల్లూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ షెల్టర్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీడీఓ డి.చంద్రశేఖర్, పంచాయతీ ఈఓ నందిశెట్టి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఎండ వేడిమి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది చింతపల్లి శ్రీను, లక్కినేని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భరతమాత ముద్దుబిడ్డ ఆజాద్

వేంసూరు: భారతమాత ముద్దుబిడ్డ, దేశ స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుడు ఆజాద్ చంద్రశేఖర్ అని యూటీఎఫ్, సీఐటీయూ, రైతు సంఘాల నాయకులు తెలిపారు. గురువారం చంద్రశేఖర్ 94వ వర్ధంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఈశ్వరచారి, నిర్మల కుమారి, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీతో శ్రీవారి మెట్లెక్కిన అభిమాని

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన పరిమి భరత్ కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతుల ఫ్లెక్సీతో 2,400 తిరుమల తిరుపతి దేవస్థానం మెట్లు ఎక్కి గురువారం మొక్కు తీర్చుకున్నాడు. పేరువంచకు చెందిన పరిమి భరత్ సత్తుపల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. భవిష్యత్‌లో వారు ఉన్నత పదవులు చేపట్టి పేద ప్రజలకు సాయం అందించాలని స్వామివారిని కోరినట్లు ఆయన తెలిపారు.

ఎల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చింతకాని: మండలంలోని లచ్చగూడెంలో ఇటీవల పురుగుల మందుతాగి చనిపోయిన కౌలు రైతు ఎల్లయ్య కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. వారి కుటుంబసభ్యులకు రూ.12వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు హనుమంతురావు, సీతయ్య, అచ్యుత్‌రావు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు..

తల్లాడ: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో భాద పడుతున్న పలు కుటుంబాలకు యువజన కాంగ్రెస్ నాయకుడు, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారపోగు వెంకట్ రూ.35 వేలు ఆర్థిక సాయం అందించారు. గురువారం ఆయన బాధితుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు. దేవసహాయంకు రూ.10 వేలు, తడికమళ్ల ప్రవీణ్‌కు రూ.10 వేలు, తోటపల్లి సాయమ్మకు రూ.10 వేలు, ఇస్నేపల్లి వరమ్మకు రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మల్లయ్య, గోపయ్య, లక్ష్మణ్, సింహాద్రి పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతం..



ఖమ్మం–నల్లగొండ–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో గురువారం ప్రశాంతంగా ముగిసింది. పోలీస్ బందోబస్తు నడుమ అధికారుల పర్యవేక్షణలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిర్వహించారు.


ముదిగొండ: పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు, సిబ్బంది

వైరా నియోజకవర్గంలో..

వైరా: వైరా మున్సిపాలిటీలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ బూత్‌లో మొత్తం 113 మంది ఓటర్లకు గాను 104 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ వ్యవహరించారు.

కొణిజర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో.. మండలంలో మొత్తం 66 మంది ఓటర్లకు గాను 60 మంది ఓటేశారు. వీరిలో పురుషులు 43 మంది, మహిళలు 17 మంది ఓటేయగా మొత్తం 90.9 శాతం పోలింగ్ నమోదైనట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. ఉదయం నుంచి ఓటు వేయడానికి ఒక్కరు, ఇద్దరు రావడంతో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. తహసీల్దార్ రాము పోలింగ్‌ను పర్యవేక్షించారు.

కారేపల్లి: కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో.. మండలంలో మొత్తం 177 ఓటర్లకు గాను 168 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 94.9 శాతం పోలింగ్ నమోదు కాగా సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ ఎన్.రాజారాం ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ సురేందర్‌లు ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో...

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో 277 మంది ఓటర్లకు గాను 259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ పరిశీలించగా, ఎన్నికల అధికారిగా ఎ.రామ్మోహన్ వ్యవహరించారు. సత్తుపల్లి సీఐ టి.కిరణ్ ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

తల్లాడ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 100శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 37 మంది ఓటర్లు ఉండగా.. 37 మంది ఓటు వేసి నూరుశాతం పోలింగనమోదు చేశారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ట్రెయినీ ఎస్ఐ బి.వెంకటేశ్‌లు ఎన్నికల సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీజేపీ, యూటీఎఫ్, జేఏసీ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించగా.. బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు, యూటీఎఫ్ నాయకుడు జీ.వీ.నాగమల్లేశ్వర్‌రావు ఆయా శిబిరాలను సందర్శించారు.

వేంసూరు: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో.. మండలంలో 65 ఓటర్లకు గాను 64 మంది ఓటు హక్కు వినియోగించుకుని 98.46 పోలింగ్ శాతం నమోదు చేశారు. వేంసూరు పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డీఓ రాంజేంద్ర గౌడ్, పరిశీలించారు.

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో మొత్తం 63 మంది ఓటర్లకు గాను 60 మంది ఓటు హక్కును వినియోగించుకుని 95.23 పోలింగ్ శాతం నమోదు చేశారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తరఫున ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు.

మధిర నియోజకవర్గంలో...

మధిర: పట్టణంలోని టీవీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 203 ఓటర్లకు గాను 196 మంది తమ ఓటు హక్కును వినియోగించుకుని 96.55% పోలింగ్ శాతాన్ని నమోదు చేశారు. ఎన్నికలను తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు పర్యవేక్షించగా మధిర సీఐ మధు ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు చేపట్టారు.


సత్తుపల్లి పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు


మధిర: పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రాంబాబు


కారేపల్లి హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో..

ముదిగొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో 35 మంది ఓటర్లు ఉండగా 33 మంది ఓటర్లు ఓటేశారు. ఇందులో 21మంది పురుషులు, 12 మంది మహిళా ఓటర్లు ఓటేయగా.. 94.28శాతం పోటింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని సెక్టార్ అధికారి సుమన్‌చక్రవర్తి, తహసీల్దార్ సనీతా ఎల్జిబెత్ సందర్శించారు.

బోనకల్: బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో 100శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 34 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఉపాధ్యాయులు 18 మంది, పురుషులు 16 మంది ఉండగా.. పోలింగ్ ఏర్పాట్లను మండల ప్రత్యేకాధికారి విజయ బాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ పున్నం చందర్, ఎస్ఐ మధుబాబు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మొత్తం 55 మంది ఓటర్లకు గానూ 55 మంది ఓటేసి నూరు శాతం పోలింగ్ నమోదు చేశారు. పోలింగ్ ప్రక్రియను తహసీల్దార్ ఉషాశారద పర్యవేక్షించగా.. ఎస్ఐ పి.వెంకటేష్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

చింతకాని: చింతకాని మండల కేంద్రంలోని 101వ పోలింగ్ కేంద్రంలో 88.89 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 36 మంది ఓటర్లలో 26 మంది పురుషులు, ఆరుగురు మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు.

అందరి చూపూ బీజేపీ వైపే..

సత్తుపల్లి: దేశంలో ఏ ఎన్నిక జరిగిన ప్రజల అందరి చూపు బీజేపీ వైపే ఉంటుందని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ నేత తాండ్ర వినోదరావు అన్నారు. గురువారం సత్తుపల్లిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డికి మద్దతుగా పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్, ఇన్‌చార్జ్ పుల్లారావు యాదవ్, శ్యామ్ రాథోడ్, కిరణ్, నాయుడు రాఘవరావు, సుదర్శన్ మిశ్రా, వీరంరాజు, పాలకొల్లు శ్రీనివాసరావు, విజయ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

వైరా: వైరాలోని 122వ పోలింగ్ కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు, దేవకి వాసుదేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, భూక్య శ్యామ్‌రాథోడ్ సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ బలపర్చిన పులి సరోత్తమ్‌రెడ్డికి గెలుపు అవకాశాలు బాగా పెరిగాయన్నారు. ఉపాధ్యాయులు తమ అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లు తెలిపారు.


వైరా పోలింగ్ కేంద్రం వద్ద కరపత్రాలతో వినోదరావు, నాయకులు

రెండో రోజూ కొనసాగిన జాతర


వైరారూరల్: పూజలు చేస్తున్న భక్తులు

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకోని నిర్వహించిన జాతర గురువారం రెండో రోజు కొనసాగింది. వైరా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివపర్వతులకు పూజలు, అభిషేకలు నిర్వహించారు.

వల్లాపురంలో..

ముదిగొండ: మండలంలోని వల్లాపురంలో వేంచిసియున్న మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో జాతర రెండోరోజు కొనసాగింది. గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు మాధవశర్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం ..


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: తల్లాడలో కాకతీయుల కాలం నాటి శివాలయంలో శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు మణికంఠశర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి వరకు కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం గురువారం ఒకంటిగంట వరకు లింగోద్భవ అభిషేక పూజలు జరిపారు.

భీక్యాతండా శివాలయంలో అన్నదానం..

కారేపల్లి: మండల పరిధిలోని భీక్యాతండా గ్రామంలో కొలువుతీరిన శివాలయంలో.. గ్రామపెద్ద బిచ్యానాయక్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవలఆయన పుణ్య క్షేత్రాలను సందర్శించుకొని వచ్చిన సందర్భంగా.. అన్నదానం చేశారు. ఎస్ఐ రాజారాం, కారేపల్లి శివాలయ భక్త మండలి అధ్యక్షులు నరసింహారావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు..

మధిర: మద్యం సేవించి మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వైరా ఏసీపీ రెహమాన్ హెచ్చరించారు. మధిరలో గురువారం రాత్రి స్పెషల్ డ్రైవ్ ద్వారా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తరచుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసే వారితో పాటు మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపైనా కేసు నమోదు చేస్తామన్నారు. అలాగే, ప్యాసింజర్ ఆటోల్లో పరిమితికి ప్రయాణికులను తీసుకెళ్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కాగా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడమేకాక అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని ఏసీపీ సూచించారు. తనిఖీల్లో మధిర సీఐ మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాల తనిఖీలో పాల్గొన్న ఏసీపీ, పోలీసులు

క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి

తల్లాడ: ప్రతి ఒక్కరూ క్షయ రహిత సమాజానికై కృషి చేయాలని పినపాక డాక్టర్ విజయ్ అన్నారు. గురువారం మండలంలోని మంగాపురంలో క్షయ వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీ వ్యాధి ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుందని, వ్యాధి లక్షణాలున్న వారు తప్పని సరిగా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

కంటి పరీక్షలు..

తల్లాడలో వివిధ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 24 మందిని సత్తుపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపారు. దృష్టి లోపం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కర్, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, ఆర్‌బీఎస్‌కె టీం వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీనివాస్, టీబీ సూపర్‌వైజర్ వై.సురేష్, ఎఎన్ఎం అన్నపూర్ణ, అరుణిమ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలాద్రికి 24 బస్సులు.. 165 ట్రిప్పులు

సత్తుపల్లిటౌన్: మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి పెనుబల్లి మండలం నీలాద్రీశ్వరస్వామి జాతరకు బుధ, గురువారాల్లో 24 బస్సులతో 165 ట్రిప్పులు తిప్పినట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా రూ. 8.18 లక్షల ఆదాయం లభించినట్లు తెలిపారు. 8,911 కిలోమీటర్లు తిప్పగా 91.8 ఈపీకేతో పాటు 143 ఓఆర్ సాధించినట్లు తెలిపారు.

'రైతు ధర్నా'ను జయప్రదం చేయాలి

మధిర: ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మార్చి 3న జరగనున్న మిర్చి రైతుల ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మండల కార్యదర్శి సైదులు పిలుపునిచ్చారు. గురువారం సిరిపురంలో మిర్చి రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం కల్లాల్లో ఎండబోసిన మిర్చిని పరిశీలించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు నరసింహారావు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాగులవంచ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1978–79 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 47 ఏళ్ల తర్వాత మిత్రులంతా ఒక చోట కలుసుకుని ఆలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమలో పూర్వ విద్యార్థులు వంకాయలపాటి రామకృష్ణ, అంబటి శాంతయ్య, వంకాయలపాటి సత్యనారాయణ, బల్లి వీరయ్య, కాటిని పుల్లయ్య, కోన శ్రీనివాసరావు, పూర్ణచందర్‌రావు, నారపోగు ఏసోబు, బాడిశ భాస్కర్‌బాబు, మురళి, బండి యాకోబు, గుడిపూడి అప్పారావు, రాంబాబు, యల్లంపల్లి రాజేశ్వరి, రాయపూడి పద్మావతి, కృష్ణ కుమారి, అనురాధ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


నరికిన చెట్టును చూపిస్తున్న గ్రామస్తులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ గ్రామ పంచాయతీ ఆవరణలో గల కలప చెట్లను గుర్తు తెలియను దుండగలు నరికి తీసుకెళ్లారని గ్రామస్తులు కీసర రవీందర్‌రెడ్డి, కీసర వంశీరెడ్డి, మట్టెల సమ్మెష్, అనీల్ ఆరోపించారు. గురువారం పేరు పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జీపీ ఆవరణలో ఏళ్లుగా నీడనిస్తున్న చెట్లను అనుమతి లేకుండా నరకడం సరికాదన్నారు. విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. ఈ విషయమై జీపీ కార్యదర్శి కె.రాజును వివరణ కోరగా.. ఈ చెట్ల కొమ్మలు రామాలయ మెట్లపైకి అడ్డొస్తున్నాయని భక్తులు, గంగుల సీతారావమ్మ ఇంటిపైకి వస్తున్నాయని కుటుంబీకులు తెలపగా.. ఈనెల 20న సిబ్బందితో అడ్డుకొమ్మలను తొలగించడం జరిగిందన్నారు. కానీ.. 21న కార్యాలయంలో ఎవరూలేని సమయంలో దుండగులు చెట్లను నరికి తీసుకెళ్లారని.. ఈ విషయాన్ని 22న కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని కార్యదర్శి తెలిపారు.

ఏపీఎంపై చర్యలు తీసుకోండి

కల్లూరు: బ్యాంక్ లింకేజీ పేరుతో వీఓఏలను అసభ్య పదజాలంతో దూషిస్తున్న కల్లూరు మండల ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అన్నారు. గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వీఓఏలు ఆర్డీఓ రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన ఆర్డీఓ.. సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామాంజనేయులు మాట్లాడుతూ.. పనులు ఉంటే చేయించుకోవాలి కానీ.. మహిళలు అని చూడకుండా దూషించడం ఎంటని ప్రశ్నించారు. పల్లెటూర్లలోని డ్వాక్రా మహిళలకు సరిగా పనిలేనందునే రెండోసారి లోన్ తీసుకోవడానికి ఇష్టపడలేదని దీంతో టార్గెట్లు పూర్తి కాలేదన్నారు. ఇకనైనా ఏపీఎం తన పనితీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, జిల్లా సమితి సభ్యులు దామాల దయాకర్‌రావు, తెలంగాణ వీఓఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి, కోకన్వీనర్ అరుణ, దేవమణి, రజిత, షహీదాభేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ రాజేందర్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఓఏ సభ్యులు

వ్యాపార రంగం.. కుదేలు

- బేరాలు లేక వెలవెలబోతున్న దుకాణాలు
- ఆన్‌లైన్ మార్కెటే కారణమని వ్యాపారుల ఆవేదన
- ఫలితంగా తగ్గిపోతున్న ఉపాధి అవకాశాలు


మధిరలోని షాపుల వద్ద టూ లెట్ బోర్డులు


జనసంచారం లేక బోసిపోతున్న మధిరలోని మెయిన్ రోడ్డు

మధిర: పంటలకు సరైన ధర దక్కక రైతుల చేతిలో డబ్బు లేకపోవడం.. ఈ ప్రభావం మిగతా వారిపైనా ఉండడంతో జిల్లాలోని పలుప్రాంతాల్లో వ్యాపార రంగం కుదేలవుతుంది. బేరాలు లేక కొన్ని దుకాణాలు మూతపడుతున్నాయి. నెలనెలా టూ లెట్ బోర్డుల సంఖ్య పెరుగుతోంది. ఇందుకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కూడా ఓ కారణమని చెబుతుండగా.. స్థానికంగా సంప్రదాయంగా దుకాణాలు నిర్వహిస్తున్న వారు మూసివేస్తుండడంతో అందులో పని చేసే వారు ఉపాధి కోల్పోతున్నారు. సొంత భవనాలు ఉన్న వారు చేసేదేం లేక షాపులను కొనసాగిస్తుండగా ఒక్కోరోజు కనీస కొనుగోళ్లు కూడా జరగడం లేదని వాపోతున్నారు.

అందుబాటులో ఆన్‌లైన్

ప్రస్తుతం సమాజంలో అందరి చేతుల్లో ఇంటర్నెట్‌తో కూడిన సెల్‌ఫోన్లు వచ్చేశాయి. పల్లె, పట్నం తేడా లేకుండా ఈ–కామర్స్ సంస్థలు కోరుకున్న వస్తువును ఇంటి ముంగిట్లోకి చేరుస్తున్నాయి. దీనికి తోడు పోటాపోటీగా ధరలు తగ్గిస్తుండడంతో గతంలో ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా షాపులకు వెళ్లే జనం ఇప్పుడు ఆన్‌లైన్‌వైపే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా గ్రామాల మాటేమో కానీ మండల, నియోజకవర్గ కేంద్రాల్లోనూ దుకాణాల పరిస్థితి దయనీయంగా మారింది. నెలనెలా రూ.వేలల్లో అద్దె చెల్లించలేక, దుకాణాల్లో పనిచేసే వర్కర్లకు జీతాలు ఇవ్వలేక, విద్యుత్, నిర్వహణ బిల్లులు భరించలేక పలువురు షాపులు మూసివేస్తుండడంతో టూ లెట్ బోర్డుల సంఖ్య పెరుగుతోంది.

తగ్గిపోతున్న బేరాలు

మధిర, సత్తుపల్లి, వేంసూరు, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ తదితర మండలాలు ఆంధ్రాకు సరిహద్దులో ఉంటాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ప్రస్తుత ఏపీలోని పలు జిల్లాల ప్రజలు తమ పిల్లలను తెలంగాణలోని విద్యాసంస్థల్లో చేర్పించేవారు. ఇందులో కొందరు విద్యార్థులు హాస్టళ్లలో ఉండగా, ఇంకొందరు గదులు అద్దెకు తీసుకునేవారు. దీంతో అటు విద్యార్థులు, వీరిని చూసేందుకు వచ్చే తల్లిదండ్రులతో వ్యాపారాలు జోరుగా కొనసాగేవి. రెడీమేడ్, ఫ్యాన్సీ, కిరాణా, ఫుట్‌వేర్, బుక్‌స్టాళ్లే కాక హోటళ్లుగా రద్దీగా ఉండేవి. అయితే, రెండు రాష్ట్రాలుగా విడిపోయాక స్థానిక సమస్యతో ఏపీ వాసులు తమ పిల్లలను ఖమ్మం తదితర ప్రాంతాల్లో చేర్పించకపోవడం కూడా సరిహద్దు పట్టణాల్లో వ్యాపారాలు తగ్గడానికి ఓ కారణంగా విశ్లేషిస్తున్నారు.

నగరాలు, కార్పొరేట్ మాళ్లు

మధిర, సత్తుపల్లి ప్రాంత వాసులు చిన్న షాపింగ్‌కు సైతం ఖమ్మం లేదా విజయవాడ వెళ్లేవారు. మధిర ప్రాంతం నుంచి విజయవాడ వెళ్లడానికి ప్యాసింజర్ రైలులో రూ.15తో టికెట్ కొంటే సరిపోతుంది. ఇక ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలుచేస్తుండడంతో మహిళలు దుస్తులు, బంగారు ఆభరణాల కొనుగోలుకు ఖమ్మం, హైదరాబాద్‌కు వెళ్తున్నారు. దీనికి తోడు జిల్లా నలుమూలల కార్పొరేట్ సంస్థల షాపింగ్ మాళ్లు ఏర్పాటయ్యాయి. వీటి కారణంగానూ సంప్రదాయ షాపుల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

కూలి కూడా రావట్లే..



పుట్టినప్పటి నుంచి స్వర్ణకార వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న. గతంలో ప్రతిరోజు మంచిగా పని లభించేది. ఇప్పుడు రెడీమేడ్ ఆభరణాలు వచ్చాక వృత్తిదారులకు ఆదరణ కరువైంది. కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు.

– దురిశెట్టి నాగేశ్వరరావు, స్వర్ణకారుడు

బోణీ కూడా కావడం లేదు..



ఒక్కోరోజు బోణీ కూడా కావడం లేదు. వ్యాపారాలు లేక ఇబ్బంది పడుతున్నాం. అద్దెలు భారమవుతున్నాయి. కార్పొరేట్ కంపెనీల మాల్స్, ఆన్‌లైన్ బిజినెస్‌తో మా లాంటి చిరు వ్యాపారాల పరిస్థితి దయనీయంగా ఉంది.

– బబ్లూ, ఫుట్‌వేర్ షాపు, మధిర

ఆన్‌లైన్ బిజినెస్ పెరిగింది..



ఆన్‌లైన్ బిజినెస్ పెరిగాక వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. దుకాణం అద్దె, వర్కర్ల జీతాలు చెల్లించలేకపోతున్నాం. బేరాలు లేక ఖర్చులు పెరిగి పలువురు షాపులు ఖాళీ చేస్తున్నారు. దీంతో టూ లెట్ బోర్డులు పెరుగుతున్నాయి.

– సిద్ధంశెట్టి సందీప్, జ్యూయలరీ షాపు, మధిర

వర్కర్లను తగ్గించాం..



గతంలో షాపు రద్దీగా ఉండేది. కొద్ది నెలలుగా ఒక్కోరోజు బోణీ కూడా కావడం లేదు. బేరాలు లేక వర్కర్లను తగ్గించాము. నెల వచ్చేసరికి జీతాలు చెల్లించాలంటే భారమవుతోంది. అందుకే పది మందిలో ఎనిమిది మందిని పంపించాం.

– వి.మల్లికార్జునరావు, వస్త్ర దుకాణాదారుడు